క్లుప్తంగా

డాక్టర్ బుడాన్ సాహెబు ఇకలేరు



తెనాలిఅర్బన్: ప్రముఖ వైద్యులు డాక్టర్ బుడాన్ సాహెబు (84) బుధవారం మృతిచెందారు. ఆయనకు ఒక కుమారుడు ఉన్నారు. ఆయన తెనాలి, రేపల్లె, మంగళగిరి ప్రాంతాలలోని పలు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులుగా గతంలో సేవలందించారు. అలాగే తెనాలి బోసురోడ్డులో ప్రవేట్ వైద్యశాలను ఏర్పాటు చేసి సేవలందిస్తు వస్తున్నారు. ఆయన కుమారుడు, కోడలు వైద్యులుగా ఉన్నారు. ఆయన భౌతికకాయానికి సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు వైద్యులు, పట్టణ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొల్లిపర: కొల్లిపర సబ్‌స్టేషన్ పరిధిలోని అన్నవరం ఫీడర్‌లోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ పి.ప్రదీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. తూములూరు, హనుమానుపాలెం, లంబాదిపాలెం, అన్నంవరం, అన్నవరం గొడపాలెం, పాత బొమ్మువానిపాలెం ఆయా గ్రామాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.


పుష్కర ఘాట్‌లో చెత్తాచెదారం తొలగింపు



తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని సీతానగరం కృష్ణానది పుష్కర ఘాట్‌ల వద్ద బుధవారం కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు క్లీనింగ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంలో పుష్కర ఘాట్‌ల వద్ద శుభ్రం చేయకపోవడంతో ఘాట్‌మెట్లుపై చెత్త పేరుకుపోవడం, మత్తబాబుల ఆగడాలకు ఘాట్ మొత్తం సీసా పెంకులు ఉండడంతో స్థానికులు కమిషనర్ అలీంబాషా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు పుష్కర ఘాట్‌లను శుభ్రం చేసి పెయింటింగ్ వేస్తున్నట్లు వివరించారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

'చలపతి' చైర్మన్ వైవీ ఆంజనేయులు



మోతడక(తాడికొండ): ఇంజినీరింగ్ విద్యానభ్యసించే విద్యార్థులు భవిష్యత్‌లో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. ప్రపంచ పారిశ్రామికవేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకొని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ఎంటర్‌ప్రెన్యూవర్ సెల్ ఆధ్వర్యంలో బుధవారం కళాశాల ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థి దశలోనే నూతన ఆవిష్కరణలు చేసి పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా భవిష్యత్‌లో ఉద్యోగ కల్పన స్థాయికి ఎదిగి పారిశ్రామిక వృద్ధిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ కొల్లా నాగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో అకడమిక్స్ డీన్ పి.ఫణికుమార్, ఏఐ హెడ్ సుంకర శాంతిప్రియ పాల్గొన్నారు.

మట్టి.. రాళ్లతో మమ!!



కృష్ణ మందిరం వద్ద గొయ్యిని రాళ్లతో పూడ్చడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు



రేపల్లె గేటు మలుపు వద్ద గొయ్యిని మట్టితో పూడ్చిన దృశ్యం

గుంతలను కనీసం కాంక్రీటుతో పూడ్చని సిబ్బంది

తెనాలిరూరల్: పట్టణ 23, 24 వార్డుల్లో రెండు గేట్ల మధ్య ప్రాంతంలో నివసించే ప్రజలకు రోడ్డు కష్టాలు ఇప్పుడప్పుడే తీరేలా కనబడడం లేదు. గుంతలమయంగా ఉన్న రోడ్లు, లీకవుతున్న రక్షిత మంచినీటి పైపులైన్లు ఇందుకు కారణం. వాహనదారులు నిత్యం ఈ వార్డుల్లో నరకం అనుభవిస్తున్నారు. వీటిపై వార్తా కథనాలు వచ్చినా అధికారుల్లో చలనం ఉండడం లేదు. తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. వార్డుల్లోని గుంతలమయంగా ఉన్న రోడ్లు వాటివల్ల స్థానికులు పడుతున్న కష్టాల గురించి వివరిస్తూ ఈ నెల 17వ తేదీన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కోట్లలో పన్నులు వసూలు చేస్తున్నా రోడ్ల మరమ్మతులకు అధికారులు నిధులు కేటాయించలేకపోతున్నారు. సీసీ రోడ్లలోని గుంతలను కేవలం మట్టి, రాళ్లతో పూడ్చి సరిపెట్టారు. రెండు గేట్ల మధ్య ప్రాంతంలోని ప్రధాన రోడ్డులో రేపల్లె గేటు మలుపు, ఆర్‌ఆర్ నగర్ మలుపు వద్ద గోతులను కేవలం మట్టితో పూడ్చారు. ఇదే రోడ్డులోని కృష్ణ మందిరం వద్ద రోడ్డు మధ్యన ఉన్న గొయ్యిని రాళ్లతో పూడ్చారు.

ఈ రాళ్ల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో అధ్వానంగా తయారైన సీసీ రోడ్లను తొలగించి కొత్తగా రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ దిశగా చర్యలు తీసుకునేందుకు నిధుల సమస్య అడ్డుపడుతుందని సాకులు చెబుతున్న అధికారులు, కనీసం కాంక్రీటుతో గుంతలను పూడ్చించ లేరా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

విభజించు-పాలించు సిద్ధాంతం అమలుకు పాలకుల యత్నాలు

- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుల ఆరోపణ
- తెనాలిలో చేపట్టిన బంద్ విజయవంతం
- తెల్లవారుజాము నుంచి నిలచిన ఆర్టీసీ బస్సులు
- పట్టణంలో నిరసన ర్యాలీ
- సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం



తెనాలి రైల్వే స్టేషన్ ఎదుట అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

తెనాలి: విభజించు... పాలించు అనే సిద్ధాంతాన్ని అమలు చేసేందుకు కేంద్రంలోని మోదీ, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరశిస్తూ తెనాలి పట్టణంలో బుధవారం చేపట్టిన బంద్ విజయవంతమైంది. జేఏసీ నాయకులు తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకుని బస్సులను బయటకు రాకుండా అడ్డుకున్నారు. అలాగే అక్కడ రెండు గంటల పాటు ఆందోళన చేశారు. ఉదయం నుంచి వ్యాపారులు స్వచ్ఛందంగా తమ షాపులు మూసివేశారు. అలాగే బంద్‌తో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. అయితానగర్ అంబేద్కర్ కూడలి నుంచి ప్రారంభమైన ద్విచక్ర వాహన ర్యాలీని పిల్లి విద్యాసాగర్, గెద్దటి సుందర్ సునీల్, కారుమంచి రవి కుమార్, యంద్రపాటి అశోక్ కుమార్, బి.ప్రదీప్, కారుమంచి సునీల్‌లు జెండా ఊపి ప్రారంభించారు. అయితానగర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ రజక చెరువు, బస్టాండ్, రైల్వే స్టేషన్, చెంచుపేట, మార్కెట్ సెంటర్, వహాబ్ చౌక్, బోసురోడ్డు, గాంధీచౌక్, శివాజీచౌక్‌ల మీదుగా కొత్తపేటలోని సబ్ కలెక్టర్ కార్యాలయంకు చేరింది. అక్కడ కొద్దిసేపు నిరసన తెలియజేస్తు నినాదాలు చేశారు. మోదీ డౌన్ డౌన్, చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇచ్చారు. అలాగే రైల్వే స్టేషన్ సెంటర్ నుంచి తెనాలి డివిజన్ మాల మహానాడు సంఘాల జేఏసీ నాయకులు అక్కిదాసు కిరణ్ కుమార్ నేతృత్వంలో పట్టణంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. అలాగే ప్రధాన రహదారిపై పలువురు నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదమ్ముల వలే ఉన్న మాల, మాదిగలను విడదీసేందుకు కొన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణ పేరిట కుట్ర చేసేయని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ పేరిట ఎస్సీల రిజర్వేషన్‌లను ఎత్తివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కులగణన యుద్ధప్రాతిపదికన జరగాలని డిమాండ్ చేశారు. వెంటనే కేంద్రం, సుప్రీంకోర్టు స్పందించి ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బేతాళ ప్రభాకర్, యాతాటి అనీల్, బోరుగడ్డ గిరిబాబు, యంద్రపాటి స్టాలిన్, కనపర్తి అనీల్, పిల్లి ప్రేమ్‌రాజ్, బడుగు రమేష్, మండ్రు రాజు, వేముల మహేష్, ఉన్నం నాని, బండ్లమూడి నాగేశ్వరరావు, గురవయ్య, పిల్లి గంగాధర్, బురదగుంట రమేష్, కందుల ఏసుబాబు, ఉన్నం సాల్మన్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



తెల్లవారుజామున ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులను అడ్డుకుంటున్న జేఏసీ నాయకులు



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరాటే అకాడమీ ప్రతినిధులకు మంత్రి అభినందన



కరాటే పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తున్న ఐటి శాఖమంత్రి నారా లోకేష్

తాడేపల్లిరూరల్: కరాటే పోటీలలో గెలుపొందిన క్రీడాకారులను మంత్రి నారా లోకేష్ ఉండవల్లిలోని ఆయన కార్యాలయంలో బుధవారం అభినందించారు. ఈనెల 15 నుంచి 18వ తేదీ వరకు చండీఘడ్‌లో నిర్వహించిన పోటీలలో జేకే గోజుర్యూ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా అకాడమీ ఉండవల్లి బ్రాంచ్ కోచ్ బి.నరసింహారెడ్డి మాట్లాడుతూ భవానీపురం, ఉండవల్లి బ్రాంచ్ నుంచి మొత్తం ఏడుగురు క్రీడాకారులు పాలక్ సోలంకి, కె. హరిచందన, తేజశ్రీసాయి, వి.సాధ్విక్, భువన్ సాయి, ఎస్‌కె సాఫియా, చార్వి అగర్వాల్ పాల్గొని మెడల్స్ గెలుపొందారని చెప్పారు. కార్యక్రమంలో అకాడమీ భవానీపురం మెయిన్ బ్రాంచ్ కోచ్ కె. హరినాథ్ పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ గోపుర కలశ ప్రతిష్ట

ఫిరంగిపురం: మండలంలోని శిరంగిపాలెంలోని బాలాంజనేయస్వామి గోపుర కలశ ప్రతిష్ట కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రెండో రోజు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని ముఖమండపంలో వైఖనస ఆగమ పండితులు దీవి పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు చేశారు. సాయంత్రం యాగశాలలో ఆలయ కలశాలు, శీతల యంత్రం, ధ్వజస్తంభానికి విశేషపూజలు, జలాధివాసం, క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, అధివాసాలు నిర్వహించి నవగ్రహారాధనలు రుత్వికులు సురేషకుమార్, గోవర్ధన్‌రఘురామ్, సురేష్, రామకృష్ణ, నాగఫణి నిర్వహించారు. శీతలయంత్రాన్ని విశేషంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించారు.

అక్రమ కేసులు బనాయించడం దారుణం

మంగళగిరి: కేసులతో సంబంధం లేకపోయినా అక్రమ కేసులు బనాయించడం దారుణమని వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి వీరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్ భవనంలో బుధవారం వీరయ్య ఆయన సతీమణి దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణతో కలసి విలేకరులతో మాట్లాడారు. మంత్రి నారా లోకేష్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తెనాలికి చెందిన సుధారాణి తనపై ఫిర్యాదు చేసినట్లు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలలో నిజం లేదన్నారు. తనపై తప్పుడు కేసు బనాయించాలని టీడీపీ నాయకుల ఒత్తిడితోనే సుధారాణి ఫిర్యాదు చేసినట్లు తెలిసిందన్నారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలి

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి
- తుళ్లూరు కేవీఆర్ జెడ్పీ స్కూల్ తనిఖీ



తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

తాడికొండ: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద నిర్మిస్తున్న కెమిస్ట్రీ ల్యాబ్, క్రీడా స్థలాన్ని పరిశీలించి, సూచనలు జారీ చేశారు. 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడిన ఆమె బోధనాంశాలపై పట్టును పరిశీలించి ఆంగ్లంపై ఉన్న పట్టును తెలుసుకునేందుకు బోర్డుపై పదాలు రాసి విద్యార్థులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతేడాది 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం తక్కువగా ఉందని, ఈ ఏడాది నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేసి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులు ఏఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో గుర్తించి ప్రత్యేక శ్రద్ధ కనబరిచి శిక్షణ అందించాలని కోరారు.

కేంద్ర పథకానికి ఎంపిక

అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా కార్యక్రమం కింద జిల్లాలో మొదటి విడతలో 21 స్కూళ్లు, రెండో విడతలో 4 స్కూళ్లు ఎంపికయ్యాయన్నారు. ఆరు పారా మీటర్లతో పాఠశాలను మోడల్ స్కూళ్లుగా తయారు చేయడమే పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉన్నత పాఠశాలలే కాకుండా ఇందులో కొన్ని ప్రైమరీ స్కూళ్లు కూడా ఈ పథకం కింద ఎంపికయ్యాయని, తుళ్లూరు కేవీఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌ను పీఎంశ్రీ కింద ఎంపికైందని, ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తన నైపుణ్యాలను పెంచుకోవడానికి ల్యాబ్‌లు, బయాలజీ, సైన్స్ ల్యాబ్‌లు, కెమిస్ట్రీ ల్యాబ్ ఇంటిగ్రిటీ ల్యాబ్స్, కంప్యూటర్ ల్యాబ్స్, స్పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాబ్‌లు అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. తుళ్లూరు జెడ్పీ హైస్కూల్ సీఆర్‌డీఏ నుంచి స్మార్ట్ స్కూల్ ప్రాజెక్టుగా ఎంపికైందని, దీనికి ఈ పథకం కింద క్రీడా పరికరాలు అందజేయడం జరుగుతుందన్నారు. పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్ ఉందని, పాఠశాల టీచర్లకు సమ్మర్ హాలిడేస్‌లో డైట్ సెంటర్‌లో సమగ్ర శిక్షణ అందించడం జరుగుతుందని వివరించారు. పూర్వ విద్యార్థులు, పెద్దలు పాఠశాలకు సాయం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి దుర్గాబాయి, ఈఈ నాగజ్యోతి, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎంఈఓలు రాజశేఖర్, అబ్దుల్ సుభానీ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం సరఫరాలో నాణ్యత పాటించాలి

మంగళగిరి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరాలో నాణ్యత పాటించడంతో పాటు రుచికరమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆవరణలోని వంటశాలను సందర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు అక్షయపాత్ర భోజనం చేస్తుందన్నారు. మెనూ ప్రకారం సమయానికి భోజనం సరఫరా చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ కోమలి పద్మ, ఏడీపీ రాజాబాబు, తహసీల్దార్ ఎస్కే సుభాని పాల్గొన్నారు.

బాల్యవివాహంతో ఆరోగ్య సమస్యలు



పాఠశాలలో మానవహారంగా నిలిచి ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు జెడ్పీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాల్యవివాహం చేసుకోవడం వలన కలిగే ఇబ్బందులపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ చిన్న వయస్సులో బాల్యవివాహాలు చేసుకోకూడదని చెప్పారు. దీనివల్ల ఆరోగ్యపరమైన ఎన్నో సమస్యలు వస్తాయన్నారు. ఎవరైన బలవంతంగా బాల్య వివాహం చేయిస్తున్నా చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కి ఫోన్ ద్వారా తెలియజేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో మానవహారంగా నిలిచి వారిచే బాల్యవివాహ నిషేధ చట్టం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ. ఇమ్మానియేల్, ఉపాధ్యాయురాలు సుజాత, అంగన్‌వాడీలు సునీత, సీతారాఘవ, ఏఎన్‌ఎం మేరిశిరీష పాల్గొన్నారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే అదాలత్



విద్యుత్ అదాలత్‌లో మాట్లాడుతున్న జస్టిస్ విక్టర్ ఇమ్మానుయేల్

తెనాలిరూరల్: విద్యుత్ శాఖకు సంబంధించి వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్)ను ఏర్పాటు చేసినట్టు ఫోరం చైర్మన్ జస్టిస్ ఎన్. విక్టర్ ఇమ్మానుయేల్ తెలిపారు. పట్టణ సుల్తానాబాద్‌లో తెనాలి డివిజన్ ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విజయవాడ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ జరిగిన అదాలత్ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో కలిసి జస్టిస్ ఎన్ విక్టర్ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు. తెనాలి డివిజన్ పరిధిలోని వినియోగదారులు సూచించిన పలు సమస్యలను నమోదు చేయించారు. డివిజన్ పరిధిలోని వినియోగదారులు రాతపూర్వకంగా తమ సమస్యలు తెలియజేయగా సుమారు ఆరు కేసుల వరకూ అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని సమస్యలు సివిల్ వివాదాలతో కూడుకున్నవి కావడంతో వాటిని పరిష్కరించుకుని విద్యుత్ అధికారులను కలవాలని సూచించారు. ఈ సందర్భంగా జస్టిస్ విక్టర్ ఇమ్మానుయేల్ మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు పరిష్కరించడంతో పాటు వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు విద్యుత్ అదాలత్ కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. తెనాలిలో గత ఏడాది ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని, తిరిగి రెండోసారి అదాలత్ కార్యక్రమాన్ని ఇక్కడ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాంకేతిక సభ్యుడు కె. వెంకట కృష్ణ, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యురాలు ఎ.సునీత, విద్యుత్ జిల్లా అధికారి ఆవుల మురళీకృష్ణ యాదవ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి, ఏడీఏ బి. అశోక్‌కుమార్, తెనాలి డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత ముందుకు రావడం అభినందనీయం



బీజేఆర్ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ప్రసాద్

తెనాలిరూరల్: పేదలను ఆదుకునేందుకు యువత ముందుకు రావడం అభినందనీమని సీనియర్ ఏపీపీ సుద్దపల్లి సుకుమార్ అన్నారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో ఏర్పాటు చేసిన కూచిపూడి విజయబాబు మెమోరియల్ ట్రస్ట్‌ను మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు తెనాలి బీజేఆర్ కమిటీ అధ్యక్షుడు మేకల సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సుకుమార్ మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు కూచిపూడి ప్రసాద్ తన తండ్రి పేరిట ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా వేదికపై ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను సన్మానించారు. తొలి సేవా కార్యక్రమంలో భాగంగా బీజేఆర్ తెనాలి కమిటీకి రూ. 25 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సుద్దపల్లి మురళి, కఠెవరపు దేవయ్య, అత్తోట చంటి, పొన్నగంటి రమేష్, కిన్నెర నాగరాజు, ఆలపాటి కరుణ, కొండముది బోసుబాబు, వినయ్ పాల్గొన్నారు

చిరువ్యాపారులు దేశసంపద సృష్టికర్తలు

క్లబ్ జిల్లా గవర్నర్ ఉదయ్ సుధీర్ పిలాని



పుష్‌కాట్‌లను పంపిణీ చేస్తున్న గవర్నర్ ఉదయ్ సుధీర్ పిలాని, శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: చిరువ్యాపారులు దేశ సంపద సృష్టికర్తలని రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం జిల్లా గవర్నర్ ఎస్ ఉదయ్ సుధీర్ పిలాని పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మార్కెట్ యార్డులో 22 పుష్ కాట్‌లను చిరువ్యాపారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు తమ వృత్తులలో నిష్ణాతులని, వారు ఇతరులపై ఆధారపడకుండా జీవనాన్ని సాగిస్తుంటారని చెప్పారు. పుష్ కాట్‌లను అద్దెకు తీసుకుని చాలా మంది ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వారికి చేయుత నివ్వాలని ఉద్దేశంతో వీటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. అందరు వీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని సూచించారు. అసోసియేషన్ తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీకె వీవీఎల్ ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి రూ.లక్ష, ఉదయ్ సుదీర్ పిలానీ రూ.1.50 లక్షలు వీటి కొనుగోలుకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టి. రాజశేఖరరెడ్డి, శివరంజనీ, పెరుమాళ్ళు, మురళీకృష్ణ, డి.మురళీ, వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణచంద్, చేతన్‌రాజ్, రాంబాబు, ప్రసాద్, ఉపేంద్ర, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

మంత్రి సవితకు సంఘ నాయకుల వినతి



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ రజక వృత్తిదారుల సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: రజక అభివృద్ధి– సంక్షేమ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవితకు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదార్ల సంఘం నాయకులు బుధవారం విన్నవించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో ఆమెకు వినతిపత్రం అందజేశారు. భాస్కరయ్య మాట్లాడుతూ ఇస్త్రీ చేసుకుంటున్న రజక వృత్తిదారులకు ప్రభుత్వం చెప్పిన విధంగా 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను మంజూరు చేయాలని కోరారు. మోడ్రన్ దోబీ ఘాట్స్ సిటీ కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని, రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, ఆదరణ పథకం ద్వారా వృత్తి పరికరాలు అందించాలని కోరారు. 50 సంవత్సరాలు దాటిన ప్రతి రజక వృత్తిదారునికి పెన్షన్ అవకాశం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన మంత్రి సవిత రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో సంఘం గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు బొజ్జ సుబ్బారావు, దావులూరి శ్రీనివాసరావు, నూతక్కి నాగేశ్వరరావు, మంగళగిరి– తాడేపల్లి నగర గౌరవ అధ్యక్షులు మోర్తోట సుబ్బారావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్లకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్లతో కోచ్ సంధాని

మంగళగిరి: గుంటూరు జిల్లా జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ మాస్టర్స్ మెన్స్ ఉమెన్స్ పోటీలలో మంగళగిరికి చెందిన పవర్‌లిఫ్టర్లు పతకాలు సాధించినట్లు కోచ్ సంధాని తెలిపారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన తెనాలి పట్టణంలో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో 43 కేజీల కేటగిరిలో పి.శ్రావణి సిల్వర్ మెడల్, 69 కేజీల విభాగంలో పి.అంజిలి గోల్డ్ మెడల్ సాధించగా జూనియర్ విభాగంలో 47 కేజీల విభాగంలో పి.శ్రావణి సిల్వర్ మెడల్, 57 కేజీల కేటగిరిలో షేక్ సాదియా ఆల్మాస్ గోల్డ్ మెడల్, 69, 84 కేజీల విభాగాలలో పి.అంజలి, షేక్ షబీనాలు గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. సీనియర్, బ్రెంచ్ ప్రెస్ పోటీలలో 43 కేజీలు, 76 కేజీల విభాగాలలో పి.శ్రావణి, ధనశ్రీలు సిల్వర్ మెడల్స్ సాధించగా 57, 63, 69, 69, 84 కేజీల విభాగాలలో సాదియా ఆల్మాస్, వినీత, భవాని, అంజిలి, షేక్ షబీనాలు బంగారు పతకాలు సాధించగా పలువురు అభినందించినట్లు తెలిపారు.